# ఎర్ర గులాబి

ఇంట్లో దిగిన తర్వాత అదే మొదటిసారి యింటివాళ్ళతో దెబ్బలాడడం! నాకు సాధారణంగా కోపం రానేలేదు, ఒచ్చిందంటే...అంతే! ఆ అమ్మాయి అలా అంటుంటే ఎలా ఊరుకొనేది? ఏదో వంకబెట్టి అంటుందా అంటే అదీకాదు. ఎవరితోనో చెప్తున్నట్టుగా గట్టిగానే అంటోంది. పోనీ, మగాడిని నేను కల్పించుకోవడం ఎందుకని ఊరుకుందామనుకున్నా పేరెట్టి నన్నే అంటుంటే యింకా ఊరుకోనా?

పెద్ద విషయంకూడా కాదు! పువ్వుల్ని కోశానని అరగంట బట్టి దులిపేస్తోంది. వెధవ పువ్వులు ఎవడిక్కావాలి? అలా అంటుందని తెలిస్తే కొయ్యకేపోదును.

ఉన్న ఆ మూడు వాటాలకి ఒకటే దొడ్డి. ఆ దొడ్లో కాస్తా వాళ్ళవైపుగా వుందని మల్లెతుప్ప మీద అధికారం అంతా వాళ్ళకే వుండాలా? అటూ యిటూ వున్న వాటాలవాళ్ళెవరూ ఒక్కపువ్వయినా కొయ్యడానికి వీల్లేదు?...నేను చెప్పడమేమిటి, వాళ్ళమ్మే అంటేను. "రోజూ అమ్మాయి మల్లెపువ్వుల్ని పెట్టుకొని కాలేజీకు వెళ్ళడం అలవాటు. దానికి తెలిసివుండగా మరెవ్వరినీ ఆ పువ్వుల జోలికి పోనీదు" అంది యింటావిడ. ఆ మాటల్లో తెలీడంలేదూ ఎవరూ పువ్వులు కోయడానికి వీల్లేదని.

'కోస్తే ఏమవుతుందేం?' అని ఎడంవాటాలో కాలేజీ కుర్రాడిలా కోశానుగనకనా? పొద్దుటే స్నానంచేసి దేవుడిపటంమీద నాలుగు పువ్వులు పెడదామంటే ముందురోజు

సాయంత్రం పూలవాడు రాకపోవడంతో, యింట్లో ఒక్క పువ్వులేదు. సోమవారంపూట వట్టిచేతుల్తో నమస్కరించడం ఏమిటని నాలుగు మల్లెపువ్వుల్ని కోస్తొంటే ఆ అమ్మాయి నిక్కచ్చిగా అనేసింది-'మల్లెపూలని ఎవ్వరినీ కొయ్యనివ్వడంలేదండీ' అని.

అలా అన్నంతమాత్రాన కోసిన పువ్వుల్ని వదిలిపెట్టి వచ్చేసేవాడ్నికాదని యింకా ఆమెకు తెలీదుగాబోలు, మస్తుగా కావలసినన్నీ కోసుకుని మరీవచ్చాను. కన్నీళ్ళ పర్యంతం అయిపోయిందా అమ్మాయి. ఉక్రోషంవచ్చి అరగంటసేపు ఒకటే తిట్టడం. బండబూతులు తిట్టకపోయినా, ఎంతయినా కాలేజీ పిల్లకదూ, నీతులు చెప్పేధోరణిలో వాగుతోంది.

ఇక ఎంతకని ఊరుకునేది? అంతకీ నా శ్రీమతి రెండుమూడు సార్లు తగులుకొంది. అయితేమాత్రం లాభంఏమిటి; నేనూ కలుగజేసుకోకతప్పలేదు. గట్టిగానే అడిగాను-మూడు వాటాలకీ ఒకటే దొడ్డయినప్పుడు అందరికీ ఆ చెట్టుమీద హక్కుంటుందన్నాను.

"ఇంటివాళ్ళం మేం ఉండగా అద్దెకున్నవాళ్ళకసలు దానిమీద హక్కేలేదు" అంది కోర్టులో బల్లగుద్దిచెప్తున్న లాయరంత గొంతుపెట్టి. ఎంతయినా కాలేజీపిల్ల! అందులోనూ లాయరువాసనలు వంటబట్టే ఐ.సి.ఎల్ చదువుతోందాయె!!

నాకు విసుగొచ్చి ఊరుకున్నాను. ఆ అమ్మాయిమాత్రం కాలేజీకి వెళ్ళేవరకు ఆడిపోసుకుంటూనే వుంది!

పోనీ అంతటితో సరిపెట్టాలా, సాయంకాలం కాలేజీ నుండి వచ్చాకకూడా తిట్టడమే? పొద్దున్న గొడవ పొద్దుటితో సరి. మళ్ళీ సాయంకాలం కూడానా?

ఇంతకూ సాయంకాలం రావడంతోటే మళ్ళీ యింతరభసా ఎందుకు చేస్తున్నదో అంతా తెలిసిపోయింది! ఎడంవాటాలోని కాలేజీ కుర్రాడు ప్రొద్దుట జరిగినదంతా ఎవరో మిత్రుడి చెవిలో వేసాడట. అది అలా అలా పాకిపోయింది. అంతా కూడబలుక్కుని ఆ అమ్మాయికి 'మల్లేలమ్మ' అని నిక్‌నేమ్ పెట్టారట! నాజూగ్గా, పొట్టిగా వున్న 'శశి'కి బదులు, మోటుగా, పొడుగ్గావున్న 'మల్లేలమ్మ' అని అంతా పిలుస్తూ ఏడిపిస్తొంటే ఆ అమ్మాయికి కోపం తాళప్రమాణంలో పెరిగిపోయుంటుంది. వాళ్ళను ఏమీ అనలేక సగంలోనే లేచి యింటికి వచ్చేసి నా మీద యిలా పట్టించింది!

ఇక ఆ యింట్లో ఒక్కక్షణం వుండాలనిపించలేదు. నా శ్రీమతి నా అభిప్రాయాన్నే

బలపరిచింది. వరుసగా రెండు రోజులు ఊరల్లా తెగతిరిగాను, అద్దెకు యిల్లేమన్నా దొరుకుతుందేమోనని.

నిజానికి నా మనసు గునుస్తూనే వుంది-అంత మంచి యిల్లు, అన్ని సౌకర్యాలున్నది-ఎలా విడిచిపెట్టడం? అయినా తప్పనిసరి. ఒకసారి యిలా ఎవరో ఒకరు చేస్తేగాని ఆ అమ్మాయికి బుద్ధి వచ్చేటట్టులేదు.

నేను యిల్లు గురించి తిరుగుతున్నానన్న సంగతి యింటావిడ ఎలా పసిగట్టిందోగాని సాయంకాలం ఆఫీసునుండి రావడంతోటే, అంతసేపూ యింటావిడ మా శ్రీమతితో జరిపిన సంభాషణా సారాంశాన్ని నాకూ వప్పగించింది-"చూడు నాయనా! నువ్వేదో కోపగించుకుని వెళ్ళిపోదామనుకుంటున్నావు. నీకు తెలీదు గనకనా, మా పిల్ల బుద్ధే అంత. ఏమీ అనుకోకు. ఏదో ఆకతాయితనం"

ఇంటావిడ మాత్రం మంచిదే. ఆ అమ్మాయిది అంతా వట్టి కోతిబుద్ధి. ఆమె అంత ప్రాధేయపడుతూ అడుగుతుంటే కాదుకూడదని వెళ్ళిపోవడం ఏంబావుంటుంది? మరి ఆ అమ్మాయి? ఏదోలే కుర్రతనం అనుకుని వుండిపోక తప్పలేదు.

నేనుమాత్రం ఆ యిల్లెలా విడిచిపెడతాను? దొడ్లో కుళాయి, ఇంటికి కరెంటు, మేడమీద వాటాకి చెరోగది-ఇన్నీ వుండి ఆఫీసుకి అంత దగ్గర్లో మరోయిల్లు కావాలంటే మాత్రం దొరుకుతుందా? ఏదోలే వ్యవహార జ్ఞానంలేని చిన్నపిల్ల, దీనికంతగా బాధపడాలా-అనుకున్నాను.

మా శ్రీమతి చెప్పేంతవరకూ యీ విషయం నాకు ఎందుకు జ్ఞాపకం రాలేదో ఆశ్చర్యంగానే వుంది? భేషయిన సలహా యిచ్చింది. రామస్వామి దగ్గరకెళ్ళి రేపీపాటికి మొక్క తేనూ. మరో నాలుగు నెలల్లో యింత మొక్కల్లా అంతమొక్క అయిపోదూ? ఇక పూలు పూయడం మొదలెట్టిందా సీజన్ పొడుగునా పూలే పూలు!

సాయంకాలం యింటికొస్తూ చేత్తో ఓ మొక్కను కూడా పట్టుకొచ్చాను. వెధవది చేతిలోకి వచ్చేసరికి దుంపతెగింది. బేడ ఖరీదైనా వుండదు, వాడికి పట్టుదల ఎందుకో. మల్లె అంటు యివ్వమంటే అదిలేదని గులాబీ అంటు విడిగా వుందని తీసిచ్చాడు. ఊరికే వస్తే వద్దనడం ఎందుకని ఏదో ఒకటిలెమ్మని వెంటబెట్టుకు చక్కావచ్చాను.

వస్తున్నప్పుడే అనుకున్నాను ఆ అమ్మాయి చూడాలని. శ్రీమతీ నేనూ గొయ్యతీసి మొక్క పాతి నీళ్ళు పోసేవరకు పడ్డ శ్రమంతా మేడమీంచి చూసి మూతి మూడు వంకర్లు తిప్పుకొంటూ లోపలికి వెళ్ళిపోయింది.

నేను మొక్కవేస్తే మొలవకపోవడం అంటూ వుండదు. నాలుగు నెలల్లో నా అంత ఎత్తుకి పెరిగింది. అసలు యీ సంగతి ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే ఒకరోజు శ్రీమతి నా దగ్గరకు వచ్చి చూశారా, మూడు నెలలకే మొక్క నా అంత ఎత్తు ఎదిగిపోయిందండోయ్ అంది. అప్పటినుండీ నా ఎత్తుకు ఎప్పటికి పెరుగుతుందోనని రోజూ కొలవడం మొదలెట్టాను. సరిగ్గా మొక్కనాటిన నాలుగు నెలలకు నా ఎత్తుకి వచ్చింది. అందుచేతే యింత ఖచ్చితంగా నా ఎత్తు-అంటే అయిదడుగుల ఎనిమిదంగుళాలు ఎదిగిందని చెప్పగలుగుతున్నాను.

రోజూ సాయంకాలం అయ్యేప్పటికి లుంగీ ఎగ్గట్టి నీళ్ళోయడం నావంతు. మొగ్గ తొడిగిందోలేదో, యింకెంత కాలానికి తొడుగుతుందో ఊహించి లెక్కలుకట్టడం శ్రీమతి వంతు. చిన్న పిల్లవాడంటూ యింట్లో ఎవరూ లేరుగాని వుంటే మొక్కను సగానికి విరిచేయడం వాడివంతులోకి వెళ్ళేది!

ఏమిటో, యీ మధ్య నాకళ్ళకు సులోచనాలు తగిలించాల్సిన అవసరం వస్తూన్నట్లుంది! లేకపోతే ఎవరికీ కనిపించని మొగ్గ శ్రీమతి కొక్కర్తికే ఎలా కనిపించింది? వీధిలో పేపరు చదువుకుంటున్న నా దగ్గరికి శ్రీమతి గట్టిగా పిలుస్తూ పరుగెత్తుకుని వస్తొంటే ఏంకొంప మునిగిపోయిందో అని ఆశ్చర్యపోయినా, ఆమెను యింకాస్సేపు పరుగెట్టిద్దామని తలుపు వెనకాలే దాక్కున్నాను. సరాసరి వీధిలోకి పోయిన శ్రీమతి మళ్ళీ వెనక్కు అదే స్పీడులో వచ్చి తలుపు వెనకాల నన్ను కనిపెట్టేసి 'భలేవారే' అన్నట్టు ఓ చూపు గిలిగింతలు పెడ్తున్నట్టు చూసి "మొక్కమొగ్గ తొడిగిందండోయ్" అంది.

శ్రీమతి చేత్తో పంచదార జిలేబీ చేసినా ఏడిసినట్టే వుంటుందిగాని ఆ మాటల్లో మాత్రం రసగుల్లా రుచిఅంతా వుంది.

ఆమె చెప్పిందే తడవుగా దర్భీగుఱ్ఱంలా పరుగెత్తికెళ్ళి చెట్టంతా వెతికాను. ఈసారి నిజంగా సులోచనాలు కావలసివచ్చాయి. ఎంతవెతికినా కనిపించందే!

చివరికి ఆవిడ్నే చూపించమన్నాను.

శ్రీమతి ఆ కొమ్మా యీ కొమ్మా వత్తిగించి, ఓ పలవకొమ్మని ముందుకు వంచి "కనిపించిందా?" అంది.

"ఏదీ ఎక్కడా?" అన్నాను ఏమీ కనిపించకపోవడంతో.

"అవేనండి. అవిగో ఎత్తుగా మొటిమల్లా వున్నాయి చూశారూ-పసుప్పచ్చ

రంగులో-అవే మొగ్గలు. బాగా పెరిగాక ఎర్రగా వస్తాయి. ఇంతకూ కనిపించాయా?" అంది నావైపు తిరిగి.

అది చెప్తున్నప్పుడు ఒకటోక్లాసు కుర్రాడికి ఓనమాలు దిద్దిస్తూ ఒకసారి రాకపోతే రెండోసారి మరింత విపులంచేస్తూ చెప్పేటప్పటి ఫోజు పెట్టింది.

'హమ్మయ్య' అనుకుని శ్రీమతి కళ్ళల్లోకి చూశాను-ఎక్కడన్నా గెద్దపోలికలు వున్నాయేమోనని. లేకపోతే యింకా వారం రోజులకు గాని మొగ్గాకారానికి రావుకదా అవి, అప్పుడే ఎలా కనిపించాయి!?

ఈ వారంరోజులూ యింటిదగ్గర వుండే సమయంలో అధికభాగం ఆ చెట్టుదగ్గరే వుండేవాళ్ళం. మొగ్గ ఫలానా అప్పుడు విడుస్తుంది. ఫలానా రోజు రాత్రికే విడుస్తుంది. అసలు రాత్రి నిద్రపోయేవేళకే రేఖలు ఒక్కొక్కటే విడుస్తుంటాయి. ఒంటిగంట వేళకి అన్నీ పూర్తిగా విచ్చుకుంటాయి-ఇవే లెక్కలు.

అన్నట్టు ఆ ఒక్క గులాబీని ఏంచెయ్యడం?

శ్రీమతి ఎలాగూ దాన్ని తలలో పెట్టుకుందామని చూస్తుంది. వీల్లేదు. మొట్టమొదటిసారిగా పూసిన పువ్వు ఆవిడ తలలోకి ఎక్కడమా? లాభంలేదు, అది దేవుడి పటంమీదకే పోవాలి.

పదిరోజులకు మొగ్గ బాగా పెద్దదై ఈ రాత్రికే పూర్తిగా విచ్చుకోడానికి సిద్ధంగా వుంది. మూడున్నరకు లేస్తేసరి. వెధవది...మత్తు ఎక్కువ, లేవడానికి వీలవుతుందోలేదో? ఆలస్యంగా లేచే అలవాటు యీనాటిదిగనకనా...చిన్నప్పుడు చదువుకొనే రోజుల్నుంచీ వున్నదే. పరీక్షల్లోనయినా పెందరాళే లేచినపాపాన పోలేదుకదా! అలారం పెడితే...! ఎక్కడిది? నిన్ననేగా ఇబ్రహీం వాచి హాస్పటల్‌కి వెళ్ళింది. పోనీ గడియారం లేకపోతేనేం ఎదురింటి సుదర్శనంగారి కోడిపుంజు సరిగ్గా నాలుగింటికే అరుస్తుంది...కాని అరుపు వినిపిస్తుందోలేదో? దానికి ఆకలిగావుంటే...అసలే ఆయన పిసినిగొట్టు...కోడికి తిండికూడా సరిగ్గా పెట్టేరకంకాదు.

ఈ ఒక్కరాత్రికి కోడిని తెచ్చి మంచానికి కడితే? అమ్మో యీ సంగతి ఎవరికైనా తెలిస్తే యింకేముంది...పోనీ యీ రాత్రికి వీధి అరుగుమీద నిద్రపోతేనో-కోడికూత గట్టిగా వినిపించి తెల్లారగట్టే తెలివివచ్చేస్తుంది. కాని యివి శీతాకాలపు చలిరోజులుకదా. మంచుగడ్డలాటి చలిలో..అరుగుమీద...ఒక్కడినీ నిద్రపోవడమే?! ఎలాగోలా యీ ఒక్కరాత్రీ గడిపేస్తేసరి. రాత్రికి భోజనం చెయ్యకుండా వుంటే ఆకలికి తొందరగా తెలివి

వస్తుందంటారు. కాని ఎలా? భోజనం మానేద్దామంటే యీ ఆత్మారాముడు ఊరుకోవద్దూ. అందులోనూ యీవేళ వేపుడుకూర! జిహ్వకి కాస్త పసందుగా కూడా వుంటుంది! మరయితే ఏంచెయ్యడానికీ తోచదేం ఖర్మ!

ఆరు నూరైనా నూరు ఆరైనా యీవేళ వీధి అరుగుమీదే నిద్రపోవాలి. మంచుపడి చలికొరుకుతూవుంటే వేగంగానైనా తెలివొస్తుంది.

ఎలా అయితేనేం ఆరోజు సెకండ్‌షో సినిమాకు ఫ్రీపాసు లభించినా వెళ్ళకుండా-తీరా వెళ్ళితే తెల్లవారు ఝామునే తెలివిరాదని-చలికి గడ్డకట్టిపోయి, సుదర్శనంగారి కోడి ధర్మమా అని నాలుగింటికే లేచి, సగం మాత్రమే తెరుచుకున్న కళ్ళతో దొడ్లోకి వెళ్ళిచూస్తే గులాబీమొక్క మొదలకంటా పెకిలించేసి వుంది!

దానితో కళ్ళు పూర్తిగా విచ్చుకున్నాయి.

ఆతృతగా శ్రీమతి దగ్గరికి పరుగెత్తుకొచ్చేసరికి శ్రీమతి నిద్రలో 'కొయ్యడానికి వీల్లేదు ఊహూఁ వీల్లేదు' అంటోంది మా మూర్తిగాడి మర్ఫీరేడియో స్థాయిలో.

శ్రీమతిని నిద్రనుండి లేపేసరికి బ్రహ్మాండమయ్యింది.

"ఏమిటీ?" అంది లేస్తూనే.

గబగబా దొడ్లోకి తీసుకెళ్ళి మొక్క చూపించి - ఈ పనంతా ఆ కాలేజీపిల్లే చేసుండాలి"అన్నాను.

శ్రీమతి మరికాస్త దగ్గరకు వెళ్ళి "అదిగోనండోయ్! ఇది మరింకెవరిపనీకాదు, అదే చేసింది" అంటూ ఎదుటికన్నంలోకి చూపించింది.

అమాంతం ఆ పక్కనున్న బండరాయి తీసి దానిమీద ఎత్తేద్దామనిపించింది.

నా ప్రయత్నాన్ని పసిగట్టిన పందికొక్కు ముందే అక్కడనుండి జారుకుంది!

అయినా అదేంచేసింది?...ఇంతకూ మా శ్రీమతిని అనాలి. అసలు విషయం ఆ తర్వాత ఆవిడే చెప్పింది.

ఉల్లిపొట్టువేస్తే గులాబీ మొక్క బాగా ఎదుగుతుందని ఎవరో చెప్తే ఏకంగా ఉల్లిపాయల్నే మొక్కచుట్టూ పాతిందట! అది పసిగట్టిన పందికొక్కు వేళ్ళతోసహా మొక్కను దొలిచేసింది!

✪